క్లుప్తంగా

కొత్తగూడెంలో డీఎస్సీ కోచింగ్ సెంటర్



సెంటర్‌ను ప్రారంభిస్తున్న సాబీర్‌పాషా

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రజ్ఞ డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభ్యర్థులు దూరప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రజ్ఞ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ శ్రీను, సీనియర్ ఫ్యాకల్టీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుండగులపై చర్యలు తీసుకోండి..

జూలూరుపాడు: సిద్ధిపేట మండలంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకుడు పెండ్యాల విజయభాస్కర్ కోరారు. సోమవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మాగాంధీ అహింసా మార్గంలో శాంతియుతంగా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడని, ఆయన విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న వీరబ్రహ్మచారి

టేకులపల్లి: మూడు పార్టీలు ఒకే పార్టీగా ఏర్పడి నిర్వహిస్తున్న మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి ధర్మపురి వీరబ్రహ్మచారి, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు జర్పుల సుందర్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మార్చి మూడో తేదీన ఖమ్మంలో జరిగే మూడు విప్లవ పార్టీల ఐక్యత భారీ ప్రదర్శన, బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఏనుటి నాగయ్య, సీతారాములు, లాకావత్ నరేశ్, బానోతు కృష్ణంరాజు, పోలెబోయిన ప్రసాద్ పాల్గొన్నారు.

కేటాయింపుల్లో గందరగోళం



మార్కెట్‌లో నిర్మాణం పూర్తయిన షెడ్లు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం రైతుబజార్ స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం మొదలు పెట్టిన సమయంలో రైతుబజార్, దానిని ఆనుకొని ఉన్న ప్రైవేట్ మున్సిపల్ మార్కెట్‌ను అధికారులు రెండున్నర సంవత్సరాల కిందట కూల్చివేశారు. దీంతో రైతుబజార్‌లోని చిరు వ్యాపారులకు తాత్కాలిక షెడ్లు వేసి కూరగాయల అమ్మకాలు జరిగే విధంగా చూశారు. దీంతో పాటుగా మున్సిపల్ ప్రైవేట్ మార్కెట్ కోసం కూడా మున్సిపల్ అధికారులు నూతనంగా 64 మంది చిరు వ్యాపారులు కూరగాయాలు అమ్మేందుకు గానూ షెడ్ల నిర్మాణం చేపట్టారు. కాగా, షెడ్ల కేటాయింపుల్లో గందరగోళం నెలకొనడంతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. నూతన షెడ్లలో ఇంకా అమ్మకాలే పూర్తి కాలేదు, అప్పడే కొంత మంది బడా వ్యాపారులు, అవసరమున్న వారికి కొంత డబ్బులు ఇచ్చి ఆ షెడ్లను వారి పేర్లపై రాయించుకున్నారు. ఇంకా కొంత మంది వారికి ఇష్టం వచ్చిన దగ్గర షెడ్లను తీసుకొని ఇబ్బందులు పెడుతున్నారని అక్కడి చిరు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. మొత్తం మున్సిపల్ అధికారులు నిర్మాణం చేపట్టిన 64 షెడ్లకు గానూ మున్సిపల్ అధికారులు, పోలీసుల సమక్షంలో డ్రా తీసి, డ్రాలో నెంబర్ వచ్చిన వారికి షెడ్(షాపు)ను కేటాయించాలని, ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు తీసుకోవడం వలన చాలా మందికి అన్యాయం జరిగే అవకాశం ఉందని వ్యాపారులు వాపోతున్నారు. దీంతో పాటుగా మున్సిపల్ అధికారులు, చిరు వ్యాపారులకు జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో షెడ్ల నిర్మాణం చేస్తే, వాటిల్లో అమ్మకాలు ప్రారంభం కాకముందే, షాపులను అమ్ముకోవడం, కొనుగోలు చేయడం వంటివి సరికాదని కొందరు పేర్కొంటున్నారు. వీటిపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించి అర్హులైన వారికి న్యాయం జరిగే విధంగా చూడాలని చిరు వ్యాపారులు కోరుతున్నారు.

ఇన్‌చార్జ్‌లతోనే పాలన..

- రెండు నెలల సెలవులో వెళ్లిన ఇల్లెందు మున్సిపల్ కమిషనర్
- స్థానం ఖాళీగా చూపించకపోవడంతో దక్కని పోస్టింగ్
- అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న డీఈ
- రెగ్యులర్ కమిషనర్ లేక గాడి తప్పుతున్న పాలన



ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం

ఇల్లెందు: పదిహేను రోజుల కిందట రాష్ట్రవ్యాప్తంగా 74 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేశారు. ఆ బదిలీల్లో ఇల్లెందు మున్సిపాలిటీకి చోటు లభించలేదు. దీంతో ఇన్‌చార్జ్ కమిషనర్ ద్వారా పాలన సాగుతోంది. ఇక్కడి కమిషనర్ యాదగిరి రెండు నెలల కిందట సెలవులో వెళ్లారు. సెలవులో ఉన్నా మరోచోటకు బదిలీ కోసం ప్రయత్నాలు చేయకపోగా.. విధుల్లో ఎప్పుడు చేరతారో తెలియని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ఇక్కడి స్థానం ఖాళీ చూపకపోవడంతో బదిలీల్లో రెగ్యులర్ కమిషనర్ నియామకం జరగలేదు. దీంతో ఇల్లెందు మున్సిపాలిటీ కమిషనర్ బాధ్యతలను డీఈకి అదనంగా అప్పగించారు. తెలంగాణ ఏర్పడ్డాక ఇల్లెందు మున్సిపాలిటీకి ఎక్కువ సమయం రెగ్యులర్ కమిషనర్ లేకపోగా.. ఒక్కరిద్దరు నియమితులైనా రెండు, మూడు నెలలకు మించి కొనసాగలేదు. ప్రస్తుతం సెలవులో ఉన్న కమిషనర్ యాదగిరి కూడా అతి తక్కువ సమయమే విధులు నిర్వర్తించారు. అసెంబ్లీ ఎన్నికలు ముగియగానే ఆయన సెలవులో వెళ్లగా, డీఈ నవీన్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి నెట్టుకొస్తున్నారు.

ఆది నుంచి అదే నిర్లక్ష్యం

ఇల్లెందు మున్సిపాలిటీపై ఆది నుంచి నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఇల్లెందులో కమిషనర్‌గా పనిచేస్తున్న యాదగిరి డిసెంబర్‌లో సెలవుపై వెళ్లిపోయారు. కారణాలు మాత్రం తెలియడం లేదు. అయితే, మరోచోటకు బదిలీ చేయించుకుంటే ఇల్లెందు స్థానం ఖాళీగా ఉండి, ఇటీవల జరిగిన బదిలీల్లో కొత్త కమిషనర్‌ను నియమించేవారు. కానీ, ఆయన సెలవు ముగిశాక, ఇక్కడే విధుల్లో చేరతారనే భావనతో పోస్టు భర్తీ చేయలేదని తెలుస్తోంది. రెగ్యులర్ కమిషనర్ లేకపోతే ఇతర విభాగాల ఉద్యోగులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించటం, పాలన నెట్టుకురావడం ఇల్లెందులో సర్వసాధారణంగా మారింది. రెండు శాఖలను ఒకే అధికారి పర్యవేక్షించాల్సి రావడంతో ఎటూ న్యాయం జరగకపోగా.. మున్సిపాలిటీపై ఆజమాయిషీ లేక పాలన గాడి తప్పుతోందనే విమర్శలు వస్తున్నాయి.

ఇంచార్జ్‌లు పాలన సాగింది ఇలా..

ఇల్లెందు మున్సిపాలిటీలో ఎక్కువ కాలం ఇన్‌చార్జ్ కమిషనర్ ద్వారానే పాలన సాగుతోంది. 2020 మార్చి 3 నుంచి 2022 సెప్టెంబర్ 27 వరకు ఎంపీడీఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2021 సెప్టెంబర్ 28 నుంచి 2022 ఏప్రిల్ 18 వరకు మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ అంజన్‌కుమార్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా కొనసాగారు. 2022 ఏప్రిల్ 19 నుంచి 2023 జూలై 26 వరకు మున్సిపల్ మేనేజర్ అంకుషావలి బాధ్యతలు నిర్వర్తించారు. ఇక ఏఈ కుమారస్వామి 2023 జూలై 27 నుంచి సెప్టెంబర్ 12 వరకు బాధ్యతలు నిర్వహించారు. ఇదే ఏడాది సెప్టెంబర్ 13 నుంచి అక్టోబర్ 15 వరకు మున్సిపల్ డీఈ నవీన్ బాధ్యతలు నిర్వహించారు. 2023 అక్టోబర్ 16 నుంచి డిసెంబర్ 11 వరకు రెగ్యులర్ కమిషనర్ యాదగిరి పనిచేశారు. ఆయన సెలవులో వెళ్లిన నాటి నుంచి డీఈ నవీన్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

మున్సిపాలిటీలో 50 ఖాళీలు

మున్సిపాలిటీలో ఉద్యోగుల కొరత వేధిస్తోంది. అన్ని విభాగాల్లో కలిపి 50 వరకు పోస్టులు ఖాళీలు ఉన్నాయి. 128 మంది పని చేయాల్సిన ఈ మున్సిపాలిటీలో ప్రస్తుతం 78 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో రెగ్యులర్ ఉద్యోగులు 72 మంది ఉన్నారు. ఇక ఔట్ సోర్సింగ్ విధానంలో 101 మంది పనిచేస్తుండగా, ఎన్‌ఎంఆర్‌లుగా 26 మంది పనిచేస్తుండగా.. సిబ్బంది కొరత కారణంగా ఉన్నవారిపై భారం పడుతోంది.

నెగ్గేనా.. వీగిపోయేనా?

- నేడు సుజాతనగర్ ఎంపీపీపై అవిశ్వాసం

సుజాతనగర్: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బలపరీక్ష జరగనుంది. ఇటీవల ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీ భూక్యా విజయలక్ష్మిపై అవిశ్వాసం ప్రకటించగా, మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మండలంలో ఎనిమిది మంది ఎంపీటీసీ సభ్యులకు గాను బీఆర్‌ఎస్‌లో నలుగురు, కాంగ్రెస్, సీపీఐకి ఇద్దరు చొప్పున ఉన్నారు. ప్రస్తుత ఎంపీపీ విజయలక్ష్మికి ఇద్దరు ఎంపీటీసీల మద్దతే ఉందని, మిగిలిన ఐదుగురు జట్టు కట్టినట్లు తెలుస్తోంది. దీంతో ఎంపీపీపై అవిశ్వాసం నెగ్గే అవకాశముంది. 2019లో జరిగిన ఎన్నికల్లో విజయలక్ష్మి కాంగ్రెస్ నుంచి గెలిచాక ఎంపీపీగా ఎన్నికై బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆమెతో కలిపి బీఆర్‌ఎస్‌కు నలుగురు ఎంపీటీసీలు ఉండగా, ఓ ఎంపీటీసీ అవిశ్వాస తీర్మానానికి మొగ్గు చూపడంతో ఈ పార్టీ బలం మూడుకు తగ్గింది. ఇక ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ అనిత చెరో రెండున్నరేళ్ల కాలం ఎంపీపీగా కొనసాగాలని తొలినాళ్లలో ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందం గడువు ముగియడంతో తనకు పదవి ఇవ్వాలని అనిత డిమాండ్ చేస్తోంది. ఇక ఇప్పుడు ఎంపీపీపై అవిశ్వాసం పెట్టి అనితకు పదవి కట్టబెడితే వైస్ ఎంపీపీ పదవి ఇంకొకరికి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యాన వైస్ ఎంపీపీ పదవి ఇస్తే అవిశ్వాసానికి మద్దతు ఇస్తామని ఇద్దరు ఎంపీటీసీలు సూచించినట్లు సమాచారం. ఈ మేరకు మంగళవారం జరిగే అవిశ్వాస పరీక్ష కీలకం కానుండడంతో ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తుకు సిద్ధమయ్యారు.

మహిళా దినోత్సవానికి ఏర్పాట్లు



మాట్లాడుతున్న అధ్యక్షురాలు నిమ్మీ ఆనంద్

ఇల్లెందు: వచ్చేనెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయనున్నట్లు సింగరేణి సేవాసమితి ఇల్లెందు ఏరియా అధ్యక్షురాలు నిమ్మీ ఆనంద్ తెలిపారు. ఇల్లెందులోని ఆఫీసర్స్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేయనున్న కార్యక్రమాలపై చర్చించారు. వేడుకగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడమే కాక ఆటల పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు జీవీ మోహన్‌రావు, సాయిస్వరూప్, సేవా సమితి బాధ్యులు కె.విజయ, ఎల్.సులక్షణ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లతో విద్యార్థులకు మేలు



ప్రశ్న పత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): టాలెంట్ టెస్టులు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యం మెరుగవుతుందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు జి.జగదీశ్, నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎంవీఎస్ చౌదరి తెలిపారు. ఈ నెల 18, 19 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో వివిధ మండలాల్లో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌ల్లో రాణించిన విద్యార్థులకు సోమవారం కళాశాల ఆవరణలో జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ చూపిన మొదటి ముగ్గురికి నగదు బహుమతితోపాటు పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామని వారు వెల్లడించారు. అనంతరం విద్యార్థులకు భగత్‌సింగ్ జీవితచరిత్ర పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం, ఎస్.భూపేందర్, మంద నాగకృష్ణ, జె.భవ్య, సీహెచ్ రామ్‌చరణ్, భవ్య, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

సుజాతనగర్: ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా అగస్త్య ఫౌండేషన్ సహకారంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రీయ దృక్పథం, సైన్స్ పరికరాలు, కృత్యాల ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించారు. సైన్స్ క్విజ్, ఉపన్యాసం, వ్యాసరచన పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ వీరభద్రరావు, ఉపాధ్యాయులు పూర్ణమ్మ, శివరామకృష్ణ, వెంకటరమణ, జీవన్‌కుమార్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

హాల్‌టికెట్లు ఇవ్వకుండా వేధించొద్దు

ఇల్లెందు: ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు హాల్‌టికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నారని, ఇకనైనా వారు తీరు మార్చుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కె.పృథ్వీ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫీజు చెల్లించలేదనే కారణంగా పలువురికి హాల్‌టికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునే అవకాశమున్నా ప్రిన్సిపాల్ సంతకం లేనిదే చెల్లవని యాజమాన్యాలు బెదిరిస్తున్నందున ఉన్నతాధికారులు స్పందించాలని ఆయన కోరారు.

సకాలంలో ఇవ్వాలి

జూలూరుపాడు: టెన్త్, ఇంటర్ విద్యార్థులకు సకాలంలో హాల్ టికెట్లు ఇవ్వాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు జె.యశ్వంత్ అన్నారు. సోమవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు, ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాలు ట్యూషన్ ఫీజులు, అటెండెన్స్ ఫీజు చెల్లించాలని విద్యార్థులకు హాల్ టికెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెడితే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గోల్డ్ మెడల్ సాధించడంపై అభినందన



ముత్తినేని విక్రమ్

జూలూరుపాడు: ఈ నెల 25న నల్లగొండలో తెలంగాణ రాష్ట్ర సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జూలూరుపాడు మండలం కాకర్లకు చెందిన ముత్తినేని విక్రమ్ గోల్డ్ మెడల్ సాధించగా పలువురు అభినందించారు. గ్రామానికి చెందిన ముత్తినేని గోపి – సునీతల కుమారుడు విక్రమ్ హకీంపేట తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. సెపక్‌తక్రా విభాగంలో విక్రమ్ రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి, జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు.

సబ్‌కమిటీ ఏర్పాటు హర్షణీయం

జూలూరుపాడు: జీఓ 317పై ప్రభుత్వం సబ్ కమిటీ ఏర్పాటు చేయడం హర్షణీయమని టీటీఎఫ్‌టీఎస్ మండల అధ్యక్షుడు ధరావత్ హనుమా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 317 జీఓపై సబ్ కమిటీ ఏర్పాటు చేయడంపై సోమవారం పాపకొల్లు హైస్కూల్ ఉపాధ్యాయులతోపాటు హనుమా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2018లో నాటి ప్రభుత్వం అనాలోచితంగా 317 జీఓ తీసుకొచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో పాపకొల్లు హైస్కూల్ హెచ్‌ఎం ఎస్కే మీరా సాహెబ్ పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ వితరణ

కొత్తగూడెంటౌన్: శ్రీరాముల రాయమల్లు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిరుపేద విద్యార్థిని ఎస్కే షాహిన్‌కు పాత్య, నోట్ పుస్తకాలు వితరణగా అందించారు. రామవరంలోని సీఆర్‌పీ క్యాంప్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు శ్రీరాముల విశ్వనాథ్, లక్ష్మి, స్వప్న, వెంకట్, పురుషోత్తం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై డిప్యూటీ సీఎంకు వినతి

టేకులపల్లి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖలోని ఆర్టిజన్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు వేర్వేరుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరారు. మండలంలోని రావులపాడుకు ఆదివారం రాత్రి వచ్చిన డిప్యూటీ సీఎంకు వారు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టిజన్ల జిల్లా జేఏసీ చైర్మన్ జర్పుల రాజేందర్, కన్వీనర్ బానోతు రవి తదితరులు మాట్లాడుతూ.. ఆర్టిజన్ నుంచి కన్వర్షన్ ఇవ్వాలని, పర్సనల్ పే ను బేసిక్‌లో కలపాలని, ప్రతీ సబ్‌స్టేషన్‌లో నలుగురు ఆపరేటర్లు, ఒక వాచ్‌మెన్‌ను నియమించడమే కాక మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల్లో అవకాశం కల్పించాలని కోరారు. అలాగే, తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు బంగారు సందీప్‌కుమార్ తదితరులు వినతిపత్రం ఇచ్చాక మాట్లాడుతూ.. ఓపీఎస్‌ల సర్వీస్ క్రమబద్ధీకరించి పే స్కేల్ వర్తింపజేయాలని, రెగ్యులర్ అయిన జేపీఎస్‌లకు 12-04-2019 నుంచి సర్వీసు వర్తించేలా ఉత్తర్వులు జారీ చేయించాలని విజ్ఞప్తి చేశారు.

సదస్సు జయప్రదానికి తరలిరండి..



మాట్లాడుతున్న ఎస్కే చాంద్‌పాషా

జూలూరుపాడు: వరంగల్‌లో ఈ నెల 28న ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా పిలుపునిచ్చారు. సోమవారం జూలూరుపాడులో జరిగిన ఏఐవైఎఫ్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సదస్సులో పలు అంశాలపై చర్చిస్తారని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, విద్యార్థి, యువజన సంఘాల నేతలు, జాతీయ నేతలు హాజరు కానున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఎస్కే బోలే మియా, యాసిన్, రియాజ్, వంశీ, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.


టేకులపల్లి సీఐ, ఎస్‌ఐలకు సన్మానం



సీఐ సురేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

టేకులపల్లి: టేకులపల్లి సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన తాటిపాముల సురేశ్, ఎస్‌ఐ షేక్ సైదారవూఫ్‌లను సోమవారం గంగారం ఎంపీటీసీ భర్త భట్టు శివ, కోయగూడెం ఎంపీటీసీ భర్త జాల మురళి సన్మానించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ బాలాజీనాయక్ ఆధ్వర్యంలో టేకులపల్లి ఎస్‌ఐ షేక్ సైదారవూఫ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ టీచర్స్ సెల్ కన్వీనర్ వాంకుడోత్ హత్తీరాం, మండల ఉపాధ్యక్షుడు రాములునాయక్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు బాలనాయక్, భద్రునాయక్, సుక్కో తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు క్వార్టర్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

ఇల్లెందు: సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. సోమవారం ఇల్లెందు జీఎం కార్యాలయంలో జరిగిన క్వార్టర్ కౌన్సెలింగ్‌లో ఫ్రెష్ ఎలాట్‌మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్‌లకు దరఖాస్తు చేసుకున్న 20 మంది పాల్గొని, తమకు అనుకూలంగా ఉండే క్వార్టర్లను ఎంచుకున్నారు. ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, మోహన్‌రావు, వీరన్న పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



ఏటీడీఓ కార్యాలయంలో సమ్మె నోటీస్ అందజేస్తున్న సీపీఎం నేతలు

ఇల్లెందు: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే డైలీవేజ్ వర్కర్ల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌ఏ నబీ కోరారు. సోమవారం ఏటీడీఓ కార్యాలయంలో సమ్మె నోటీస్ అందజేశారు. ఈ నెల 27 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో 35 ఏళ్లుగా పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లను పర్మనెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కృష్ణ, ముత్తయ్య, బాలయ్య, వినయ్ కుమార్, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

టేకులపల్లి తహసీల్దార్ బదిలీ



పుల్లయ్య

టేకులపల్లి: స్థానిక తహసీల్దార్‌గా ఈ నెల 12వ తేదీన విధుల్లో చేరిన నాగభవాని బదిలీ అయ్యారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీల్లో ఆమె గార్ల నుంచి టేకులపల్లికి వచ్చారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మూడేళ్లు పనిచేసిన వారిని వేరే జిల్లాలకు బదిలీ చేయాలనే తాజా ఉత్తర్వుల నేపథ్యంలో ఆమెను జిల్లా కేంద్రానికి పంపించారు. జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న దొడ్డి పుల్లయ్యను టేకులపల్లి తహసీల్దార్‌గా బదిలీ చేశారు. సోమవారం ఆయన విధుల్లో చేరారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

- గడువు తీరిన శీతలపానీయాలు విక్రయం



ఓ దుకాణంలో కొనుగోలు చేసిన గడువు తీరిన కూల్ డ్రింక్

టేకులపల్లి: ఎండాకాలం రాకముందే ఎండలు మండిపోతున్నాయి. దీంతో ప్రజలు దాహం తీర్చుకునేందుకు కొబ్బరిబొండాలు, శీతల పానీయాలను సేవిస్తున్నారు. ఈకాలంలో రకరకాల శీతల పానీయాల అమ్మకాలు అధికంగా జరుగుతాయి. ప్రతి కూల్‌డ్రింక్‌కి గడువు తేదీ ఉంటుంది. డేట్ అయిపోయిన శీతల పానీయాలను ఎప్పటికప్పుడు తీసేసి పంపిణీ దారులకు విక్రయించాల్సి ఉంటుంది. టేకులపల్లి మండలంలో కొందరు వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా శీతల పానీయాల అమ్మకాలు చేపడుతున్నారు. డేట్ అయిపోయినా పట్టించుకోకుండా వాటిని వినియోగదారులకు విక్రయిస్తున్నారు. డేట్ అయిపోయిన శీతల పానీయాలు తాగడం వల్ల ప్రజలు వాంతులు, విరేచనాలు తదితర అనారోగ్యాలతో ఇబ్బందులు పడుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇటీవల టేకులపల్లి సెంటర్‌లోని ఓ షాపు నుంచి ఓ వినియోగదారుడు శీతల పానీయం సీసా కొనుగోలు చేసి ఇంటికి వెళ్లాడు. తర్వాత చూసే సరికి ప్యాకింగ్ ఎక్స్‌పైరీ డేట్ 06.01.2024 అని ఉంది. దీంతో ఖంగుతిన్నాడు. మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో వందలాది శీతల పానీయాల షాపులున్నాయి. అధిక శాతం షాపుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. దుకాణాదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత పంపిణీ దారులకు ఉంటుంది. డేట్ అయిపోయిన బాటిళ్లను తిరిగి తీసుకోవడంలో, షాపు నిర్వాహకులకు సకాలంలో తెలియజేయడంలో పంపిణీదారులు విఫలం చెందుతున్నారు. వ్యాపారులు, డీలర్ల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికీ అధిక శాతం దుకాణాల్లో డేట్ అయిపోయిన శీతల పానీయాలు దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ప్రతి నెలా తనిఖీలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వమే పరీక్ష ఫీజు భరించాలి

కొత్తగూడెంఅర్బన్: మైనార్టీ గురుకులాల్లో, నీట్, ఎంసెట్, జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్షల రుసుమును ప్రభుత్వమే భరించాలని జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మైనారిటీ గురుకుల కళాశాలల్లో పలు ప్రవేశ పరీక్షల ఫీజులను ప్రస్తుతం విద్యార్థులే చెల్లిస్తున్నారని, ఏడాదికి ఒక్కో విద్యార్థికి సగటున రూ.1,20,000 పెట్టుబడి పెడుతున్న ప్రభుత్వం, ప్రవేశ పరీక్షల ఫీజును మాత్రం చెల్లించకుండా ఈ భారాన్ని విద్యార్థులపై మోపడం సమంజసం కాదని వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హాస్టల్ విద్యార్థుల ప్రవేశ పరీక్షల రుసుంను ప్రభుత్వమే భరించాలని ఆయన కోరారు.